# తప్పుకున్న గొంట్లు



## సి. ఆనందారామం

కొత్తగా వచ్చిన రాధాకృష్ణ ఇంటికి వెళ్ళాలని సాంబయ్య ఎన్నాళ్ళుగానో అనుకుంటున్నాడు - అందుకు కారణం రాధాకృష్ణ కాదు - అతని చెల్లెలు సరస్వతి—ఎంతో చక్కగాఉంటుంది. ఒక్కసారి దూరంనుంచి చూసాడు — తనను చూడగానే తలవంచుకుని వెళ్ళిపోయింది. ఏం బుద్ధి! ఏం వినయం! ఆడదంటే అలా ఉండాలి-

బ్రతికి చెడ్డవాళ్ళనీ, చెల్లెలికి పెళ్ళి చెయ్యలేక నానాఅవస్థా పడుతున్నాడనీ కూడా విన్నాడు - పోనీ, ఆ పిల్లని తనకిస్తాడేమో...

మనస్సులో ఆశ ఎంత పీకుతున్నా ఎదుటబడి అడగటానికి జంకుగానేఉంది- అద్దంముందు నించున్నాడు సాంబయ్య! తన ప్రతిబింబం తనకి ఎంతో ముద్దుగా కనిపించింది - చిన్నకళ్ళు! అయితేనేం! పెద్దకళ్ళకంటె ఎంతో బాగున్నాయి- పెద్దనోరు... అయినా అదీ ఒక అందంగానే ఉంది - చొంగ కారుతుంది అప్పుడప్పుడు - ఫరవాలేదు. తుడుచుకుంటే కనపడదు - అదొక స్టైల్‌గా చీటికీ మాటికీ మూతి తుడుచుకోవచ్చు - బొజ్జ కొంచెం పెద్దబొజ్జే!... అయితేనేం! సిరిబొజ్జ... మొత్తంమీద తను బాగుంటాడు! చాలాబాగుంటాడు.ఎంతబాగుంటే ఏంలాభం.రెండోపెళ్ళి అనేసరికి ఎవరైనా కాస్త వెనక్కు తగ్గుతారు-ఆ శనిగ్రహం తనజీవితంలోకి రాకుండా ఉంటే ఎంత బాగుండేది! అది చదువుకుందని తనకే మాత్రం తెలిసినా ఛస్తే దాని మెళ్ళో తాళి కట్టేవాడుకాడు! బి. ఏ. పాసయిందట... బి. ఏ.... బోడి బి. ఏ... ఈ మధ్యవర్తులందరూ చేరి ఆ విషయం దాచిపెట్టారు... తీరా మూడు ముళ్లూ పడ్డాక తెలిసింది అది చదువుకూడా వెలగబెట్టిందని...

"ఏవిటే! నువ్వు చదువుకున్నావా?" అన్నాడు మండిపడుతూ...

తెల్లబోయి చూసింది... దొంగ వేషాలు! ఆ చూపుల్లో ఎంత అమాయకత్వమో...

"అవును! చదువుకున్నాను!అందులో తప్పేముందీ? మీకంతకోపమెందుకు?"

"ఏడిసావులే ! అంత చదువుకున్న దానివి అక్షరంముక్క రానివాడి ని నన్నెట్లా చేసుకున్నావ్ ?"

"చదువుకున్నంతమాత్రాన చదువుకున్న మొగుణ్నే చేసుకోవాలని నియమమేముందీ ? మా అమ్మ నాన్నగారు ఈ సంబంధం కుదిర్చారు - చేసుకున్నాను-"


"ఇష్టంలేకపోయినా, అమ్మా అయ్యా కుదిర్చారని ఏడుస్తూ చేసుకున్నావన్న మాట ! అంతేనా ?"

"అదేంమాట ! నేను ఏడుస్తూ చేసుకున్నానా ? నా ముఖంలో ఏడుపు కనిపిస్తోందా ?"

చిరునవ్వు నవ్వింది ! అబ్బ ! ఎంత అందం ఆ నవ్వులో - ఆ అందం చూసే మోనపోయాడు తను ! ఆనాడే మెడబట్టి గెంటిఉంటే వదిలిపోయేది ?

"నువ్వు చదువుకున్నావని తెలిస్తే నేను చేసుకునేవాణ్ని కాదు !" గునుస్తూ అన్నాడు-

"ఈ విషయం మావాళ్ళు మీదగ్గిర దాచారని నాకు తెలియదు-పోనీయండి-నేను చదువుకున్నదాన్నని మీరు మరిచిపొండి-నేనూ మరిచిపోతాను-నా చదువు మనమధ్య ఏవిధంగానూ అడ్డంరాదు-" అంది. అలా అనటమేకాదు - పాదాలకు నమస్కారం చేసింది-ఆ నక్కవినయాలకు మురిసిపోయాడు - ఆ అందచందాలకు భ్రమసిపోయాడు - పాదాలమీద పడ్డదాన్ని నెత్తి నెక్కించుకున్నాడు... ఎంత కాదనుకున్నా ఆ చదువుకున్న నిక్కు నీలుగూ ఎక్కడపోతుంది ! అన్నింట్లో తను ఉన్నానంటుంది-అన్ని విషయాలూ తనకు కావాలంటుంది-పెద్దబ్బాయి డబ్బులడిగితే ఇచ్చాడు - అలా ఇయ్యకూడదట! ఇస్తే పాడయిపోతారట! అలా అన్నందుకు తనుఊరుకోలేదనుకో! నాలుగు తగలనిచ్చాడు - తన్నినా బుద్ధి వచ్చిందా? పొగరుగా ఎదురుతిరిగి నన్ను




తన్నినా భరిస్తాను - కాని నా పిల్లల్ని పాడుచేస్తే ఊరుకోను..." అంది

ఆ పిల్లలు తనపిల్లలు కారూ ! తను పాడుచేసేవాడూనూ, అక్కడికి ఆవిడ బాగుచేసేదీను...

మూడుమైళ్ళదూరంలో ఉన్న బస్తీ బళ్ళోకి పంపిస్తానని కూచుంది... ఊళ్ళో పంతులు చెప్పే చదువు సరిపోదూ ! వీల్లేదన్నా మొండికేసి పంపింది - తన్నినా, గుద్దినా తనపట్టు తనదే ! ఎంత మొండి మనిషి ! కూతురు పుట్టింది-ఎంత పొంగిపోయాడు తను! వెండికడియాలూ పట్టాలూ ముచ్చటపడిచేయిస్తే పెట్టడానికి వీల్లేదంది ! చిన్నపిల్లలకి అవన్నీ పెట్టకూడదుట ! నగలు వద్దనేమాట ఆవిడ నోటనే విన్నాడు - అన్నింటికంటె విడ్డూరం...ఆ ఆడపిల్లను కూడా బస్తీకి పంపి చదివిస్తానని కూచుంది... తను ఎన్నివిధాల ఎంతచెప్పినాబళ్ళోవేసేసింది.

ఇవన్నీ ఎలాగో సహించాడు - సర్దుకున్నాడు - రత్తాలు వ్యవహారంతోనే బెడిసికొట్టింది...

తనకు రత్తాలుమీద కన్నుపడింది-రత్తాలుకూడా సై అంది - మొగవాడు తను ! తప్పేముంది ?

ఈమాత్రందానికి అదెంమకు ఏడవాలి? లోకంలో అందరూలేరూ ! గుర్నాధానికి ముగ్గురు ముండలు ! రామనాధానికి ఇద్దరుపెళ్ళాలు, ఇద్దరు ఉంచుకున్న వాళ్ళు...

రత్తికి వెనకా ముందూ ఎవ్వరూలేరు. ఇంటికే తెచ్చేసుకున్నాడు - అక్కడితో మొదలయింది గోల !

"నా కాపురం పాడు చెయ్యొద్దు"అని గోలపెట్టినా కనికరం చూపించేవాడేమో ! హమ్మో ! అది అలా అడుగుతుందీ ? ఎంత పొగరు దానికి !

"మీ యిష్టం! బయటమీరెలాతిరిగినా నాకేం ఫరవాలేదు ! ఇంటికి మాత్రం ఎవరినీ తీసుకురావటానికి వీల్లేదు-పిల్లలు పాడయిపోతారు !" అంది - ఆ ధోరణికి ఒళ్ళు మండింది...

"ఏంచేస్తావే, తెస్తే ?..." అన్నాడు మీదికొచ్చి - ఏంమనిషి ! ఒక్కఅడుగు వెనక్కు వెయ్యలేదు - పిసరంత భయపడలేదు... విదిలిస్తున్నట్లు సమాధానం చెప్పింది...

"పిల్లలకోసమే బ్రతుకుతున్నాను-వాళ్ళకోసం ఏమైనా చేస్తాను ?"

"పిల్లలకోసం బ్రతుకుతున్నావా ? నామీద లేదన్నమాట ?"

"మీకు నామీద ఉందా,నాకు మీమీద ఉండటానికి... ఆ ఊరికి ఈ ఊరెంతో ఈ ఊరికి ఆ ఊరంత..."

"నోర్మయ్యి ! నువ్వూ నేనూ ఒకదేనా ?"

"ఎలా అవుతాం ! ఎన్ని జన్మలు తపస్సుచేసినా కాము!"

దాని కంఠంనిండా వెటకారం ! అంత పొగరు భరించలేకపోయాడు...

చావతన్నాడు - కిక్కురుమనకుండా కన్నీటిబొట్టు రాల్చకుండా దెబ్బలన్నీ తింది. తిని అంది...

"ఆ రత్తాలును ఇంటికితీసుకురావద్దు. నేను సహించను..."

ఆ రోజు రత్తాలును తీసుకుని ఇంటికి వచ్చాడు - రత్తాలుని వదులుకోలేక... అది ఏం చెయ్యగలదనే ధైర్యంతో-

ఒక్క క్షణం పిండిబొమ్మలా నిలబడి తననూ, రత్తాలునూ దెయ్యంపట్టినట్లు చూసింది - మరుక్షణం గిర్రునతిరిగి లోపలికి వెళ్ళిపోయింది - అంతే ! అంతకంటే ఏంచెయ్యగలదు అనుకున్నాడు- కానీ ఆ మరునాడు ఇంటికి వచ్చేసరికి రత్తాలు ఏడుస్తూ చెప్పింది... అది వెళ్ళిపోయిందని... పిల్లల్నికూడా తీసుకుపోయిందని... అవమానంతో శరీరం దహించుకుపోయింది - జుట్టుపట్టి ఈడ్చుకురావాలని అన్నిచోట్లా వెతికించాడు - ఎక్కడాలేదు ..పుట్టింటికెళ్ళినా నాలుగుచీవాట్లుపెట్టి తిరిగి పంపించేవారు. అక్కడికీ వెళ్ళలేదు - 'పోనీ, పీడా పోయింది' అనుకున్నాడు - 'ఫలానివాడి పెళ్ళాం, లేచిపోయింది' అనుకుంటారని తప్పిస్తే తనకు నష్టమేముందీ ? తనరత్తి లేదా... అప్పుడు అలాగేఅనుకున్నాడు- కానీ ఆ రత్తి తను పెట్టిన నగలన్నీ తీసుకుని రాత్రికి రాత్రి ఉడాయించింది. చెప్పుకుంటే సిగ్గుచేటు... నోరు మూసుకుని ఊరుకున్నాడు. ఉంచుకున్న ముండలు కట్టుకున్న పెళ్ళాంలా ఉంటారా ? మళ్ళీ పెళ్ళిచేసుకోవలసిందే ! మాయదారికాలం వచ్చిపడింది... రెండో పెళ్ళి పెద్ద నేరంట ! చట్టం ఒప్పదుట ! మొగవాడు ఎన్ని పెళ్ళిళ్ళుచేసుకుంటేనేం? పాతివ్రత్యం ఆడదానికి కాని మొగవాడికేమిటి ! ఆ సరస్వతిని ఇస్తారేమో, అడిగిచూడాలి-

మధ్యవర్తులద్వారా రాధాకృష్ణకు కబురుచేసాడు సాంబయ్య...

రాధాకృష్ణ స్వయంగా సాంబయ్య దగ్గరకు వచ్చాడు...

"ఒకప్పుడు బాగా బ్రతికినవాళ్ళమేనండీ ? ఏమిటో రోజులు బాగుండక..." అంటూ వచ్చాడు...

"దానిదేముందిలెండి ! బళ్ళు ఓడలవుతాయి. ఓడలు బళ్ళవుతాయి-" ఓదార్చాడు సాంబయ్య...

"ఈ చెల్లెలు పెళ్ళిచేసేస్తే నా బాధ్యత లన్నీ తీరిపోతాయి-కానీ, ఎలాచెప్పండి- ఈరోజుల్లో ఆడపిల్లపెళ్ళంటే మాటలా?"

"మీకు అభ్యంతరం లేకపోతే నేను చేసుకుంటాను-" ఉదారంగా ప్రకటించాడు సాంబయ్య.

"మన శాస్త్రిగారు చెప్పారు - ఎంతయినా పిల్లమీద పిల్లనియ్యటం మాటలు కాదు చూడండి..."

సాంబయ్య ముఖం వడిలిపోయింది...

"ఏదైనా నమ్మకముంటే తప్ప..." కొసరుపడేసాడు రాధాకృష్ణ.

సాంబయ్యలో ఆశ చిగురించింది.

"ఏం చెయ్యమంటారు చెప్పండి ! కొంతపొలం మీ చెల్లెలిపేర రాయనా ?"

"ఎంతమాట ! కూటికి పేదయినా కులానికి పేదనుకానండోయ్ ! పొలానికి ఆశపడి మాచెల్లెల్ని అమ్ముకోమంటారా!"

"పోనీ. ఏంచెయ్యమంటారోచెప్పండి. మీరేం చెయ్యమంటే అది చేస్తాను-"

"ఏంలేదు - ఫెళ్ళుమంటూ పదిమందిలోనూ పెళ్ళిచేసుకోండి ! అంతా మామూలుపెళ్ళిలాగా జరగాలి ! నాచెల్లికి దొంగపెళ్ళి చేసాననే బాధ నేను భరించలేను !"

ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు సాంబయ్య...

అలా పెళ్ళిచేసుకుంటే తన మొదటి భార్య తనమీద దావా తేవచ్చు... ఏడిసింది? దానికంత దమ్మెక్కడ ? కోర్టు లంటే మాటలా ? ముందు డబ్బు ! తరువాత న్యాయం ! దాని పుట్టింటి వారయినా ఆమాత్రం ఖర్చుపెట్టేవాళ్ళు లేరు-ఉంటే బి ఏ. పాసయినదాన్ని తనకిచ్చి పెళ్ళి చేస్తారా ?

సాంబయ్య ఆలోచిస్తూ కూచోవటం చూసి లేచినించున్నాడు రాధాకృష్ణ...

"క్షమించండి ! మీరు పబ్లిగ్గా పెళ్ళి చేసుకుంటేతప్ప నా చెల్లెల్ని మీకు ఇవ్వలేను..."

కంగారుపడిపోయాడు సాంబయ్య. అప్పటికి రెండేళ్ళుగా బ్రహ్మచారి జీవితం గడిపి విసిగిపోయాడు. "నేను పబ్లిగ్గా పెళ్ళిచేసుకుంటాను - నాకేం భయం లేదు-" అన్నాడు-

సరస్వతికీ సాంబయ్యకూ ఫెళ్ళుమంటూ పెళ్ళి జరిగింది. ఊరేగించారు- పెళ్ళిఫొటోలు తీసారు-విందులుచేసారు- అన్నీ లక్షణంగా జరిగాయి.

తన నెత్తిమీద కెవరేంతెస్తారో అని సాంబయ్య కొన్నిరోజులు భయపడ్డాడు. కాని నెల తిరిగేసరికి అన్ని భయాలూ అణగారిపోయాయి-

సాంబయ్యకు స్వర్గలోకంలోఉన్నట్లు ఉంది - సరస్వతి అందమైనదే కాదు- మహాపతివ్రత... తనతోకలిసి బయటకు రమ్మన్నా "నాకు సిగ్గుబాబూ ! నేను రాను !" అంటుంది-వీధిముఖం చూడదు- రోజూ మొగుడికాళ్ళు పడుతుంది-ఇంటికి ఎవరైనా మొగవాళ్ళొస్తే లోపలికిపోయి దాక్కుంటుంది - పిలిచినా రాదు.

"మనవాళ్ళే ! ఫరవాలేదు రా !" అని సాంబయ్యఅన్నా రాదు-

"ఎంత మనవాళ్లైతేమాత్రం, చెట్టంత మొగాడిముందుకు ఎలా రానండీ !" అని చీదరించుకుంటుంది.



లోపల మురిసిపోయాడు సాంబయ్య–అంతా తన అదృష్టమనుకున్నాడు.

కానీ, ముచ్చటగా మూడునెంలైనా కాకుండానే పిడుగు నెత్తినపడింది.

సాంబయ్య మొదటిభార్య తనను మోసంచేసి రెండోపెళ్ళి చేసుకున్నందుకు సాంబయ్యకు లాయర్ నోటీసిచ్చింది...

"అయ్యో ! ఇప్పుడెలాగండీ ! నా గతేం కావాలి !" అని బావురుమంది సరస్వతి...

"ఏడవకే పిచ్చిదానా ! నేనుండగా నీకు భయమేమిటీ ?" అని ఓదార్చాడు సాంబయ్య. జారిపోతున్న తనగుండెలు సర్దుకుంటూ...

లాయర్‌ను కలుసుకున్నాడు–

"మీరు రెండోపెళ్ళి చేసుకున్నారని తెలిస్తే మీకు శిక్ష తప్పదు. అసలు పెళ్ళి చేసుకోలేదని దబాయించాలి !"

"కానీ ఋజువులున్నాయి..."

"మీరు, మీ రెండోభార్యా ఒకటయితే ఆ ఋజువులేం చేస్తాయి ? ఆవిడ మీరు తనమొగుడు కాదని చెప్పాలి !"

వినటానికి సాంబయ్యకి ఎలాగో అనిపించింది... విధిలేక సరస్వతికి ఈ విషయం చెప్పాడు.

"అయ్యో! అయ్యో! ఎంతమాట! దేవుడిమీద ఒట్టుపెట్టి మీరు నా మొగుడు కాదని చెప్పనా? అంత పాపిష్టిమాట నా నోట వస్తుందా?"

గుండె బాదుకుంది సరస్వతి...

"ఏదోలే! ఆపద్ధర్మం- ఒక్కసారికి..."

"నావల్ల కాదండీ! నావల్ల కాదు! అంతకంటె ఎందులోనైనా పడిఛస్తాను- పీడ వదిలి పోతుంది-" బావురుమంది సరస్వతి-

గుండె జారిపోయింది సాంబయ్యకు- ఎంత పిచ్చిపిల్ల! చావటానికైనా సిద్ధపడుతోంది కాని తనను మొగుడు కాదని అనలేక పోతోంది.

శతవిధాల బ్రతిమాలి శతకోటి విధాల బుజ్జగించి ఎలాగో లాయర్ చెప్పినట్లు కోర్టులోఅనటానికి సరస్వతిని ఒప్పించాడు సాంబయ్య-

మరొకచిక్కు వచ్చి పడింది-

"మీకు ఆస్తివుంది- మీరు ఆవిడకు భరణం ఇయ్యవలసి ఉంటుంది..." అన్నాడు లాయర్-

"ఛస్తే ఇయ్యను..." కసిగా అన్నాడు సాంబయ్య-

"తప్పదు-ఇయ్యకుండా ఉండాలంటే ఆస్తి మీపేర లేకుండా ఉండాలి!"

ఈ సలహా నచ్చింది సాంబయ్యకు- తన ఆస్తి సరస్వతిపేర రాసేశాడు.

"నాకీ లావాదేవీలన్నీ వద్దు దేవుడోయ్!" అని సరస్వతి ఏడ్చిందిమళ్ళీ-

"పిచ్చి దానా! నువ్వూ నేనూ ఒకటి కాదూ! పేరుకు నీమీద వున్నా. అన్నీ నేనే చూసుకుంటాగా!" అని ఒప్పించాడు సాంబయ్య-

''ఏమిటో పిచ్చిలోకాన్ని మీ మాట కాదనటం నాకు చేతకాదు...'' అంటూ గునిసింది సరస్వతి.

కోర్టుకో సాంబయ్య మొదటి భార్య చిత్తుగా ఓడిపోయింది. అసలుసాంబయ్య రెండోపెళ్ళి చేసుకోలేదని ఋజువయింది. భరణం ఇయ్యటానికి సాంబయ్యకు ఆ స్తే మీ లేదు. ఈ ఘనవిజయానికి సాంబయ్యపొంగిపోయాడు. పెద్ద ఎత్తున విందులు చేసాడు—

ఆ విందులూ వినోదాలూ ముగిసిన మూడోనాడు సాంబయ్య పొలం నుండి ఇంటికి వచ్చేసరికి ఇంటి ముందు కారు ఆగివుంది. సరస్వతి చిరునవ్వుతో సాంబయ్యకు ఎదురుగావచ్చింది.

"రండి! రండి! ఇన్నాళ్ళూ ఉండి మీతో చెప్పకుండా వెళ్ళట మేమిటని చూస్తున్నాను..."అంది.

పూర్తిగా మారిపోయిన సరస్వతి వాలకానికే మతిపోయిన సాంబయ్యకు ఈ మాటలతో ప్రాణాలు పైన పోయాయి.

"ఏమిటి? ఎక్కడకు వెళ్ళటం? ఈ అవతార మేమిటి?'' అన్నాడు.

"నిజస్వరూపం!'' అంటూ పకాలున నవ్వింది సరస్వతి, చెవికున్న ముత్యాల లోలాకులు ఊగిసలాడేలాగ. చెవులకు లోలాకులు, చేతులు లేని జాకెట్టు, స్టైల్ గాఅమర్చిన సిగ-పెదవులకు లిప్ స్టిక్— అలా చూస్తూ నిలుచుండి పోయాడు సాంబయ్య.

''నేను వెళ్తున్నాను.''

చేతిలో హేండ్ బాగ్ తిప్పుకుంటూ వయ్యారంగా ముందుకు నడిచింది.

''ఎక్కడికి?" అప్పటికీ విభ్రాంతి లోంచి తేరుకోలేక అయోమయంగా అడిగాడు సాంబయ్య.

"మా ఇంటికి?''

''మీ ఇంటికా?''

''అవును! పరాయిచోట ఎన్నాళ్ళుండను?"

''పరాయిచోటా? నేను నీకు పరాయివాణ్ణా?"

''కాకపోతే, కట్టుకున్న మొగుడివా? అన్నట్లు అవిగో మంగళ సూత్రాలు."

చిలక్కొయ్యకు తగిలించిన మంగళ సూత్రాలు చూపించింది సరస్వతి.

ప్రతిరోజూ వాటిని కళ్ళకద్దుకునే సరస్వతి గుర్తుకొచ్చి కళ్ళలో నీళ్ళు తిరిగాయి సాంబయ్యకు.

''ఏమిటీ అన్యాయం?" అన్నాడు.

విరగబడి నవ్వింది సరస్వతి

"న్యాయమూ అన్యాయమూ తేలవలసింది న్యాయ స్థానంలో, ఇక్కడకాదు అక్కడనిలబడిచెప్పండి, ఏదిన్యాయమో ఏది అన్యాయమో..."

"ఇంత దారుణమా? మంచి చెడ్డలు లేవూ?"

''అలాగా! ఉన్నాయిమంచిచెడ్డలు?"

వెటకారంగా అడిగింది సరస్వతి.

సాంబయ్యతల భూమిలోకి దిగిపోయింది. అతనికి అంతాఅర్థమయింది.

సరస్వతి ముందుకు కదిలింది. సాంబయ్యలో కసి రగిలింది.

"దొంగ లంజా! తప్పి పాతేస్తాను. ఎక్కడికి కదుల్తావో చూస్తాను.'' అంటూ సరస్వతి చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

కెవ్వున అరిచింది సరస్వతి-బయట కారులో కూచున్న డ్రైవర్ ఒక్క అంగలోవచ్చి సాంబయ్యను ఒక్కతోపు తోసాడు - కుప్పలా కూలిపోయాడు సాంబయ్య...

"ఇప్పుడు నాకు టైమయిపోయింది- నీకు తీరిగ్గా ఉన్నప్పుడు నాదగ్గిరకి రా! మాట్లాడుకుందాం!"

తన విజిటింగ్ కార్డ్ సాంబయ్య మీదకు విసిరి కారులో కూచుంది సరస్వతి. సర్రున సాగిపోయింది కారు...

ఎప్పటికో లేచి కూచున్నాడు సాంబయ్య... ఏదో టక్కున క్రింద పడింది. తీసిచూసాడు-సరస్వతి ఇచ్చిన విజిటింగ్ కార్డ్ - అందులో "మిస్

సరస్వతి..." అనే అక్షరాలు భయంకరంగా కనిపించాయి. మిగిలిన చిరునామా కూడా ఉంది.

సాంబయ్య బయటకు అడుగుపెడితే చాలు! అందరూ ముసిముసి నవ్వులు నవ్వటమే. కొందరుకొందరు "బాగున్నావా సాంబయ్యా!" అని పలకరించేవారు–ఆ పలకరింపు "తగిన శాస్తి జరిగిందా సాంబయ్యా!" అన్నట్లు వినిపించేది– ఆ నరకం భరించలేకపోయాడు సాంబయ్య

సరస్వతి దగ్గిరకు బయలుదేరాడు, చిరునామానుబట్టి, ఇల్లు వెతుక్కుంటూ..

ఊరుకాని ఊళ్లో ఇల్లు వెతకటం కష్టమవుతుందనుకున్నాడు... రిక్షావాడితో "సరస్వతిగారి ఇల్లు తెలుసా?" అన్నాడు చిరునామా చెప్పి...

"మిస్ సరస్వతమ్మగారి ఇల్లా అండీ?" అన్నాడు రిక్షావాడు 'మిస్' నొక్కి పలుకుతూ...


"అవును!"

"ఆరిల్లు తెలీకపోటమేటండీ? కూకోండి!" అన్నాడు హుషారుగా...

రిక్షా ఒక దివ్యభవనం ముందు ఆగింది–సాంబయ్యకు కలయో, వైష్ణవ మాయయో అన్నట్లుగా ఉంది – గేట్ దగ్గిర చౌకీదార్ "ఎవరు?" అన్నాడు కర్కశంగా. పల్లెటూరి సాంబయ్య వణుకుతూ "నాపేరు సాంబయ్య..." అన్నాడు–

"మీరా! లోపలికి వెళ్ళండి..." అన్నాడు చౌకీదార్... బెదురుతూ లోపలకు వెళ్ళాడు సాంబయ్య... ఎటు తల తిప్పినా ఐశ్వర్యం తొణికిసలాడుతోంది. ఇది సరస్వతి ఇల్లేనా? కాకపోతే ఆ చౌకీదార్ తనపేరు చెప్పగానే ఎందుకు లోపలికి పంపిస్తాడు?

పనిమనిషి అతణ్ని ఖరీదైన సోఫాలో కూచోబెట్టింది – మరొక మనిషి కాఫీ




ఫలహారాలు అందించింది.. ఇంచుమించు అరగంటతరువాత వచ్చింది సరస్వతి.. చిరునవ్వుతో చేతులుజోడించి "చాలా కాలానికి వచ్చారు.." అంది...

సాంబయ్యకు ఏం మాట్లాడాలో తోచటంలేదు... గొంతు పెగుల్చుకుని "నేను ఏంచేసాను నీకు? నామీద ఎందుకీ పగ?" అన్నాడు–

సరస్వతి కిలకిల నవ్వింది...

"సాంబయ్యగారూ! నాకు క్షణంతీరిక ఉండదు – అందుకని నా వ్యవహారాలన్నీ చూడటానికి ఈమధ్యనే ఒక సెక్రటరీని పెట్టుకున్నాను. మీరు ఆవిడతో మాట్లాడండి–" అని పనిమనిషిని పిలిచి "సెక్రటరీని పిలు?" అంది–

సెక్రటరీ వచ్చింది – సాంబయ్య ఎగిరి నిల్చున్నాడు తన మొదటిభార్యను చూసి...

"ఈయన వ్యవహారం చూడు..." అంది సరస్వతి తన సెక్రటరీతో...

ఆవిడ తన నోట్ బుక్ తెరిచి పెన్సిల్ చేత్తో తీసుకుని "చెప్పండి!" అంది శాంతంగా.

సాంబయ్య నిలబడ్డవాడు నిలబడ్డట్టే గుడ్లప్పగించి ఉండిపోయాడు

"కూచుని చెప్పండి!" అందిశాంతంగా ఆవిడ–

ఒక్క విషయం... ఇన్నాళ్ళుగా తాను మనసులో గట్టిగా అనుకోలేనిది మెరుపులా స్ఫురించింది ఆ క్షణంలో సాంబయ్యకి...

ఈ వ్యక్తి.., తన ఎదురుగా ఇంత శాంతంగా – ఇంత నిబ్బరంగా కూచున్న ఈ తనభార్య... తనకంటే ఎన్నోరెట్లు గొప్పది... ఎందుకో ఏమిటో తెలియక పోయినా ఈవిడముందు ఎప్పుడూ తనకేదో తక్కువతనమేదో తోచింది – తన ఎక్కువతనాన్ని తనకు ఎక్కువతనమని తోచిన మార్గంలో ప్రదర్శించేవాడు...

"నన్ను... క్షమించు..." అన్నాడు గొణుగుతున్నట్లు ..

ఆవిడ నవ్వింది.

"ఎందుకు? ఏం తప్పు చేసారని? ఒక్కొక్కళ్ళకు ఒక్కొక్క రకంగా బ్రతుకు ఇష్టం. కలిసి బ్రతకలేనప్పుడు విడిగా బ్రతకటంలో తప్పేమీలేదు..."

సాంబయ్యకు మతిపోతోంది – ఈవిడకు తను సమాధానంచెప్పలేడు. ఈనాడే కాదు... ఏనాడూ చెప్పలేకపోయాడ – సమాధానం నోటితో చెప్పలేక చెయ్యి చేసుకునేవాడు – సాంబయ్య తన భార్య రెండుచేతులూ పట్టుకున్నాడు–

"నన్ను క్షమించు - నా దగ్గిరకు వచ్చెయ్యి - ఇంకముందు నిన్నొక్క మాటంటే నన్ను చెప్పుతీసుకు కొట్టు..." అన్నాడు దీనంగా...

ఆవిడ కదిలిపోయింది - సాంబయ్య పట్టుకున్న చేతులు వెంటనే వదిలించుకో లేకపోయింది...

సరస్వతి కల్పించుకుంది-

"ఇదిగో! నిన్నే! నీ టెంపరరీ మొగుడు... సారీ... మొగుడి టెంపరరీ ప్రేమకావాలో, నా పర్మనెంట్ ఉద్యోగం కావాలో బాగా ఆలోచించుకో!"

ఆ హెచ్చరింపుతో సాంబయ్య చేతులు వదిలించుకుంది ఆవిడ...

"నేను రాలేనండీ! ఎప్పటికీ మీతో వెళ్ళనని నా మంగళసూత్రాలమీద ఒట్టు పెట్టి చెప్పాను..."

"ఎవరికి పెట్టావు ఒట్టు?"

"మన అబ్బాయికి! వాడు చిన్నవాడు కాడు. అన్నీ అర్థంచేసుకుంటున్నాడు- ఆనాడు వాడిని నాతో రమ్మన్నాను- వాడు ఏమన్నాడో తెలుసా? అమ్మా నువ్విలా వెళ్తావు-మళ్ళీవస్తావు-మధ్యలో నీతో వచ్చినందుకు నాన్న నన్ను చావ తంతాడు-నువ్వు మళ్ళీరానని అంటేతప్ప నీతోరాను - అన్నాడు.

"నా బిడ్డను వదులుకోలేక మళ్ళీ ఈ జన్మలో మీతోరానని వాడికి మాట ఇచ్చాను - ఏనాడూ తండ్రిలా వాడిని బుజ్జగించలేదు - మంచి మాట లేదు- కూచున్నా నించున్నా తన్నేవారు- అందుకే వాడంతగా బెదిరిపోయాడు..."

"ఫరవాలేదు. నువ్వు వాడికి నచ్చ చెప్పగలవు..."

ఆశ చావక దేబిరింపుగా అడిగాడు.

"ఎలాగండీ! మీకు శుభం కలగాలని మనఊళ్ళోసత్యనారాయణస్వామికోయిల్లో వ్రతం చేసాను... ఏడుకొండల వెంకన్నకు వంద కొబ్బరికాయలు కొడతాను. అంతేకాని మీతో ఎలా రాగలను? ఆ ఒట్టూ ఈఒట్టూ కాదు నా మంగళ సూత్రాలమీద ఒట్టు..."

మెడనుంచి మంగసూత్రాలు తీసి భక్తితో కళ్ళ కద్దుకుంది ఆవిడ...

సాంబయ్య పూర్తిగా నీళ్ళుకారి పోయాడు.

''సరస్వతీ! పోనీ నా ఆస్తి నా కిచ్చెయ్యి-ఇంత అన్యాయం చెయ్యకు!" అన్నాడు.

సరస్వతికి ఒళ్ళు మండిపోయింది. భద్రకాళిలా లేచింది-

''ఏం మనిషివయ్యా! ఒక రోజు కాదు - రెండురోజులు కాదు... మూడు నెలలు... రోజుకి వెయ్యిరూపాయలు తీసుకునేమనిషిని... నీ చొంగమూతి ముద్దుపెట్టుకున్నానే... నీ పర్వతం లాంటి పొట్టను చూసి మురిసిపోయానే.. నీ బండజోకులకు నవ్వానే... ఇంతచేస్తే నువ్వు నాకిచ్చింది ఆ కాస్త ముష్టిఆస్తి పైగా అన్యాయమంటావు.!. నలుగుర్నీ పిలిచి అడుగు... ఏది న్యాయమో...ఏది అన్యాయమో చెప్పమను...''

సాంబయ్య లేచి బయటకు నడిచాడు నలుగుర్నీ పిలిచి అడిగితే ఎవరైనా చెప్పే న్యాయమేమిటో అతనికే తెలుసు- ఎంతైనా అతనూ ఒకమనిషే! అందుకే నలుగురిలో తలెత్తలేక తల వంచుకు గబగబ అడుగులు వేసాడు-

